
# ఇష్టం

**రవి - రఫి**



**నేను క్లాసులోకి అడుగు పెట్టాను.**

**గోల గోలగా అరుస్తున్న పిల్లలంతా ఒక్కసారిగా మౌనవ్రతం పాటించారు. అలా అని నేను చండశాసనుణ్ణి ఏం కాదు. ఆ రోజు పిల్లల్ని పాఠాలతో విసిగించకూడదని అనుకున్నా.**

పిల్లలూ "మీకు ఏ ఏ పక్షులు అంటే ఇష్టం?" చిన్న ప్రశ్నతో మొదలెట్టాను నేను.

చిలుక, పిచుక, గద్ద ఇలా రకరకాలుగా పక్షులు పేర్లు పిల్లలు చెప్పుకొంటూ పోతున్నారు.

చివరిగా రాము వంతు వచ్చింది. నాకు, పిల్లలతోపాటు కుతూహలంగా వుంది రాము 'ఏ పక్షి' పేరు చెబుతాడా అని. రాము క్లాసులోని పిల్లలందరిలో బెస్ట్ స్టూడెంట్.

రాము మెల్లగా లేచి నిలబడ్డాడు. ఏదో తటపటాయిస్తున్నాడు చెప్పడానికి.

"రాము ఏంటి...ఏదో కష్టమైన ప్రశ్నకు సమాధానం అడిగినట్లు అలా తడబడుతున్నావు. అయినా నీకు కష్టం, సులువు ప్రశ్నలని లేవుగా. ఏ ప్రశ్నకైనా ఇట్టే టక్కున సమాధానం ఇస్తావ్. ఈ రోజేమైంది అలా నాన్చుతూ నిలబడ్డావ్" నేను వెంటనే రియాక్టయి అడిగాను.

నా మాటలతో రాము ధైర్యం తెచ్చుకొన్నట్లుగా వుంది." 'కాకి సార్! నాకిష్టమైన పక్షి".

పిల్లలంతా పకపకా నవ్వారు.

నాకు ఆశ్చర్యమేసింది.

నేనో పిల్లాడిని లేపి "ఎందుకు నవ్వుతున్నావు?" అని అడిగాను. వెంటనే "రాము లాగే కాకి కూడా నలుపు కాబట్టి. రాముకి కాకులంటే ఇష్టమేమో? సార్. అందుకని నవ్వొచ్చింది." అన్నాడు మరలా నవ్వాపుకొంటూ.

నేను రాము వైపు చూశాను.

రాము తలొంచుకుని నిలబడివున్నాడు.

"ఏం రాము నీకు కాకి అంటె ఎందుకిష్టం?" ప్రశ్నించాను.

"నాకు మా అవ్వంటే ఇష్టం సార్. అందుకే కాకి అంటె ఇష్టం సార్. అంతే కాని మీరు అనుకున్నట్లు నేను నలుపని. కాకి నలుపని ఇష్టపడడం కాదు సార్! నిజం సార్!" అన్నాడు.

"అవును. కాకికి మీ అవ్వకి సంబంధం ఏమిటి?" ఒకింత నేను ఆశ్చర్యపోతూ అడిగాను.

అప్పటి వరకు గుసగుసలు పోతున్న పిల్లలు కూడా సూది వేస్తే వినపడేంత నిశ్శబ్దం పాటించారు.

"నాకు మా అవ్వంటే ఎంతో ఇష్టం. ఒడిలో కూర్చోబెట్టుకుని ఎన్నో పిట్టకథలు చెప్పేది. లాలించేది. పాటలు పాడేది. నేను ఏది అడిగితే అది కొనిచ్చేది. నాకు మా అవ్వ పక్కలో పడుకొని ఆమె కథలు బెబుతూ నన్ను జోకొడుతుంటే హాయిగా నాకు తెలీకుండానే నిద్రలో జారుకొనే వాడిని. అలాంటి మా అవ్వ ఒకరోజు నన్ను జోకొడుతూ నిద్రపుచ్చి... తను మాత్రం పొద్దున నేను స్కూల్‌కి వచ్చే టైంకి లేవలేదు. నేను ఎంతో సేపు తట్టి లేపాను. అయినా లేవలేదు. కనీసం రెప్పలు కూడా కదల్చలేదు. చేతులు పట్టుకులాగితే అవికూడా ఏం చేయలేదు. నన్ను ఒడిలో చేర్చుకోలేదు. ఏడుస్తూ నాన్న దగ్గరకు వెళ్ళాను. నాన్న అవ్వ దేవుడు దగ్గరకు వెళ్ళిందని చెప్పాడు.

ఆ రోజు...

అవ్వని మంచం మీద నించి కిందకి దించారు. పాత చాపపై పడుకోబెట్టారు. తల దగ్గర దీపం పెట్టారు. రెండు కాళ్ళు దారంతో కట్టారు. ముక్కులు దగ్గర దూది దూర్చారు. తలకి స్నానం చేయించారు. బంధువులు, చుట్టాలు వచ్చారు. ఎవరో ఒకాయన నాకు జంధ్యం వేశాడు. "మనవడే జంధ్యం వేసుకొని నాన్న (అల్లుడు) కాబట్టి" అన్నారు. నేను అవ్వతోపాటు కదిలాను. కళ్ళలో నీళ్ళు వచ్చేస్తున్నాయి. అవ్వని ఏం చేయాలి పెద్దలంతా ఏం చేస్తున్నారు? అన్పించింది. ఊరి చివరకి అవ్వని తీసుకెళ్ళారు. అక్కడ ఓ పెద్ద గొయ్యి మనిషికి సరిపోయేలా తవ్వి దాంట్లో అవ్వని పడుకోబెట్టారు. మట్టి వేయమన్నారు. ఊహూ.. అందరూ ఏడుస్తూ నేను గోతిలోకి దిగి అవ్వ గుండెలపై వాలి వెక్కి వెక్కి ఏడుస్తూ.. మా 'అవ్వ పై మట్టేయకండి. దెబ్బ తగుల్తుంది. ఆమెకి ఊపిరాడదు." అని వెక్కి వెక్కి ఏడుస్తూ చెప్పాను. అందరూ నన్ను బలవంతంగా లాగారు. అవ్వ ఇలాంటి కథలు నాకు ఎప్పుడూ చెప్పలేదు. ఎప్పుడూ చీమలు దూరని చిట్టడవి, కాకులు దూరని కారడవి, అనగనగా ఒక రాజు..." ఇలాంటి కథలు చెప్పేదే కాని ఇలా ...ఒక మనిషిని సాటి మనుషులే నిద్ర పోతున్నప్పుడు మట్టి పోసేసి పూడ్చిపెడతారని... పిచ్చి అవ్వ ఎప్పుడూ చెప్పలేదు.

నాన్న మరుసటి రోజు నన్ను లేపాడు. ఒళ్ళంతా కాలిపోతోంది. నాకు జ్వరం వొచ్చేసింది. కళ్ళు ఎర్రబడ్డాయి. 'అవ్వ' గురించి రాత్రంతా పలవరింతలేనట.

అమ్మా, నాన్నలని అవ్వ ఏదని అడిగాను. అవ్వ ఇక రాదు. తను దేవుడి దగ్గరికి వెళ్ళింది. అయితే తను 'కాకి'లా మనింటికి వస్తుంది. నీవు రోజు చూడొచ్చులే అన్నారు.

ఆ రోజు నేను మా ఇంటి ముందుండే వేపచెట్టుని గమనించాను. ఒక కాకి కావు కావు మంటోంది. నేను ఒక ఆకులో నా పళ్లెంలోని అన్నం తీసి ఒక ముద్దని ఆకులో పెట్టి గోడపై పెట్టాను. అది సంతోషంగా కావ్.. కావ్.. అంటూ వచ్చి అటు ఇటు చూస్తూ.. ఆ ముద్ద ఆసక్తిగా తిన్నది."

రోజూ నేను అన్నం వద్దని మారాం చేస్తే... గోరు ముద్దలు తినిపిస్తూ.. కథలు చెప్పే మా అవ్వకి ఆ రోజు నుంచి నేను ముద్ద కలిపి పెట్టసాగాను.

అలా... ఇప్పటికి సంవత్సరం అయింది. రేపు సంక్రాంతికి ఏడాదికి ఒకసారి అందరూ పెద్దలకి విధిగా "తమ పెద్దలు కాకులు రూపంలో వొచ్చి తాము పెట్టె అన్నం ముద్దని తింటే తప్ప వాళ్ళు అన్నం ముట్టరు" కాని నేను మాత్రం రోజూ మా అవ్వ తిన్నాకే తినేవాడ్ని."

రాము కళ్ళలో నీళ్ళు ధారాపాతంగా కారి పోతున్నాయి. పిల్లలు తమకు తెలియకుండానే ఏడ్చేస్తున్నారు.

"అందుకే సార్. నాకు కాకి అంటే ఇష్టం. మా అవ్వ ప్రతి రోజూ నాకు కాకి రూపంలో వచ్చి పలకరించి పోతుంటుంది." అని చెప్పాడు.

"అసలెందుకు సార్.. మనల్ని ఇలా ప్రేమించే వాళ్ళని దేవుడు తన దగ్గరకు తీసుకెళ్ళాలి? తనే పుట్టించాడు కదా? మళ్ళీ ఎందుకు ఆయన దగ్గరకు తీసుకెళ్ళడం? ఇదేమన్నా బాగుందా? ఆయనకి ఈ విషయం తప్పు అని చెప్పే మాష్టారు లేదా? చెప్పండి సార్. చెప్పండి సార్!" అంటూ రాము జగ్గుత్సికతో అడుగుతుంటే...

సమాధానం చెప్పలేని మొద్దు విద్యార్థిలాగ నిలబడడం నావంతు అయింది. *

## కాబోయే కలల రేడు!

'అదిగో పులి అంటే ఇదిగో తోక' అన్నట్లు పుకార్లు రేగే సినిమా ప్రపంచంలో చాలా కాలం నుంచి జరుగుతున్న తంతును మాత్రం పట్టించుకోలేదు. కరిష్మాకపూర్ పెళ్ళి చెడి, ఆ తరువాత కొంతకాలం దేవదాసు అవతారమెత్తిన అమితాబచ్చన్ కుమారుడు అభిషేక్ బచ్చన్ ఈ మధ్య బాలీవుడ్ నటి రాణీముఖర్జీతో తిరుగుతుండడం ఎవ్వరూ గమనించలేదు. వరుడి వేటలో రాణి ఉండగా, తన కలల రాణి కోసం అభిషేక్ అన్వేషిస్తున్నాడు. ఇంకేం వీరిద్దరి పెళ్ళికి పెద్దలు ఓ.కె.చెప్పడమే ఆలస్యమట. వింటున్నారా అమితాబ్‌జీ!

